
# మానవత్వం నీడల్లో

నందం రామారావు



"సుజాతా! ఈ రోజు నీ వంట్లో ఎలా వుంది ?" కృష్ణమూర్తి లోపలికి వచ్చి అడిగాడు.

అప్పటివరకూ కళ్ళుమూసుకుని బెడ్ మీద పడుకుని వున్న సుజాత భర్త మాటవిని నెమ్మదిగా లేవడానికి ప్రయత్నించబోయింది. భార్యను వారిస్తూ— "లేవకు" అంటూ వచ్చి ఆమె ప్రక్కన కూర్చుని చెంపమీద చెయ్యివేసి చూసి — "ఫర్వాలేదు, ఈ పూట అంత జ్వరం వున్నట్టు లేదు. అవునూ, ఈ టైమ్‌లో కాప్స్యూల్ వేసుకోవాలి, వేసుకొన్నావా?" అన్నాడు.

సుజాత వేసుకోలేదన్నట్టుగా తల తిప్పింది.

"వేసుకోలేదా ? మంచిపని చేశావ్ ! మల్లి ఏమైంది ?"

"కిచెన్‌లో వుంది" అంది సుజాత.

కృష్ణమూర్తి లేచి-ప్రక్కనే టీపాయ్ మీదున్న కాప్స్యూల్ తీసి, భార్య నోట్లో వేసి మంచినీళ్ళు త్రాగించి, మళ్ళీ ప్రక్కన కూర్చుని కబుర్లు చెప్పసాగాడు.

ఇంతలో మల్లి రెండు కప్పుల్లో కాఫీ తీసుకొచ్చి, చెరొకటీ ఇచ్చింది. కాఫీ కప్పు అందుకుంటూ కృష్ణమూర్తి తలెత్తి మల్లిని చూసి, ఆశ్చర్య పోయాడు.

మల్లి ఇప్పుడే విచ్చిన మల్లెపూవులా ఉంది ! పువ్వుల చీరలో మూడ చక్కగా వుంది.

"ఈ పిల్ల చాలా అందంగా వుంటుంది,' అని చాలాసార్లు అనుకున్నాడు క్రిష్ణమూర్తి. ఇప్పుడు అనుకున్నాడు.

రెప్ప వాల్చకుండా మల్లికేసి చూసి, నవ్వుకున్నాడు. మల్లి కప్పులు తీసుకెళ్ళిపోయింది.

"ఆ చీర బావుంటుందని నేనే ఇచ్చాను. ఈ చీర కట్టుకుంటే మల్లి చాలా బావుంది కదండీ !" అంది సుజాత.

"అవును సుజాతా ! ఆ అందం మల్లిలోలేదు, చీరలో వుంది. ఈ చీర కట్టుకున్నప్పుడల్లా నేనేమనేవాడ్నో గుర్తుందా ?"

సుజాత భర్త ముఖంలోకి చూడాలని ప్రయత్నించి గతించినరోజులూ ... ఆ చీర కట్టుకున్నప్పుడల్లా గడిపిన రాత్రులూ గుర్తురాగా సిగ్గుతో మాట్లాడలేకపోయింది !

..................

అప్పటికి సాయంత్రం ఆరుగంటలు దాటింది. సూర్యుని కడపటి కిరణాలు కిటికీలోంచి, గదిలోకి ప్రసరించి, సుజాత బెడ్ మీద పడుతున్నాయి.

చల్లనిగాలి శరీరానికి హాయి కలిగిస్తోంది.

"ఏవండీ ! ఇక్కడ నా పక్కన కూర్చోపోతే, ఏ సినిమాకో, క్లబ్‌కో, వెళ్ళరాదూ ?" అంది సుజాత.

పాపం సుజాతకు, ఈ సమయంలో భర్త తన దగ్గర వుండడం సుతరామూ ఇష్టం లేదు.

సాధారణంగా ఈ టైంలో మగవారు ఎవరూ ఇంటి దగ్గర వుండరు ! కానీ, తన భర్త కొన్ని నెలల నుంచి తననే అంటిపెట్టుకుని వుంటున్నాడు.

తన జబ్బు ఏమిటో ?— కాళ్ళు వాయడం, ఆయాసం, దగ్గు, పట్టుమని ఇల్లంతా తిరగలేదు ! పిల్లలు లేరు గనుక సరిపోయింది.

అక్కడికీ మల్లి అన్నీ చేసుకుపోతుంది. నమ్మకంగా వుంటూ, తనకు కావాలసిన పనులన్నీ శుభ్రంగా చేస్తుంది.

"ఏవండీ ! నావల్ల మీకు సుఖం లేకుండా పోతుంది. నా అనారోగ్య కారణంవల్ల మీ సరదాలను దూరం చేసుకోకండి !" అంది సుజాత.

"ఇదుగో శ్రీమతీ ! నీ సలహాలు బావున్నాయి గానీ, ఇంకేం మాట్లాడకు. ఎంచక్కా హాయిగా విశ్రాంతి తీసుకో ! అంతేగానీ ఏవేవో ఊహించి మనసు పాడుచేసుకోకు. ఓకే !"

ఇంతలో మల్లి వచ్చి —

"బాబుగారూ ! మీకు ఫోన్ !" అంది.

క్రిష్ణమూర్తి లేచి గదిలోకెళ్ళాడు.

మల్లి యజమానురాలి దగ్గర కూర్చుని కాళ్ళకు నూనె రాయసాగింది. చాలాసేపు గడిచింది.

అప్పటికి పూర్తిగా చీకటి పడిపోయింది.

కృష్ణమూర్తి గదిలో కిటికీ ప్రక్కన కూర్చుని బయటకు చూడసాగాడు.

ఆకాశంలో చంద్రుడు స్టీల్ పళ్ళెంలా మెరిసిపోతున్నాడు. కొబ్బరి చెట్లగాలి చల్లగా ఉంది.

కానీ, తన మనసే చల్లగా లేదు.

కొన్ని రోజులనుంచి తన మనసు అలజడిగా ఉంటోంది. మనసంతా మల్లి ఆక్రమించి గంద్రగోళ పరుస్తోంది !

మల్లి అందం !

మల్లి యవ్వనం !

మల్లి నడక !

మల్లి నవ్వు !

ఇవన్నీ తన నెక్కడికెక్కడికో లాక్కెడుతున్నాయి. మల్లిని కేవలం పనిమనిషిగా చూడలేకపోతున్నాడు.

ఒక రోజేం జరిగిందని —

తను స్నానం చేయబోయి కావాలనే బాత్‌రూంలో టవల్ పెట్టలేదు. స్నానంచేస్తూ మల్లిని పిలిచాడు.

"ఏమిటి బాబూ; పిలిచారు ?'' అంది తలుపవతల్నించి.

''టవల్ మర్చిపోయానే మల్లీ ! తీసుకొచ్చి ఇవ్వు !''

''నేనా !''

''అవును నువ్వే ! ఏం, తీసుకురావా !''

కిలకిలా నవ్వింది.

మరో రోజు —

డైనింగ్ టేబుల్ దగ్గర —

''ఇంకాస్త అన్నం వడ్డించుకోండి బాబూ !'' అంది మల్లి.

''ఇంకేం వద్దు !''

''అలా అంటే ఎలాగండి ? మజ్జిగ వేసుకుంటే వేడి చెయ్యదు, వుండండి కాస్త అన్నం పెడతాను.'' అంటూ అన్నం వడ్డించింది.

''అవతల అమ్మగార్కి అలా వుంటే !...''

''ముందు బాగా తిన్న తరవాతనే బాబూ ! మిగతా ఆలోచనలు. చూడండి, మీరెలా చిక్కిపోయారో !''

ఆ మాటకి తను తలెత్తి మల్లికేసి చూశాడు. మల్లి సిగ్గుపడిపోయి దూరంగా వెళ్ళిపోయింది !

ఇవన్నీ తనలో గుబులు రేపుతున్నాయి.

పాతికేళ్ళ మల్లి పసందుగా వుంది !

తనేం చిన్నపిల్లవాడు కాదు !

ఏ మాట, ఏ చూపు ఎటువంటిదో గ్రహించ లేనంతటి అవివేకి కాడు !

తన శరీరం మల్లిని కోరుతోంది !

కృష్ణమూర్తి ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ మల్లి అప్పుడే లోపలికి వచ్చి —

''బాబూ ! లైటు వేసుకోకుండా చీకట్లో కూర్చున్నారా ! అమ్మగారికి తొందరగా తగ్గిపోతుంది లెండి ! మీరేం దిగులు పడకండి !'' అంది.

''మల్లీ !'' అన్నాడు కృష్ణమూర్తి.

ఆ చీకటిలో, అ నిశ్శబ్దంలో ''మల్లి'' అన్న ఆ పదం ఎంతో మధురంగా ఉంది.

తను భార్యను కూడా ఎప్పుడూ మధురంగా పిలిచి వుండడు !

''ఏం బాబుగారూ !''

''అమ్మగారేం చేస్తున్నారు ?''

''ఇంతకు ముందే అన్నం పెట్టానండి ! తిని పడుకున్నారు. మీరు కూడా లేస్తే వడ్డిస్తాను.''

''అలాగే !'' అంటూ కృష్ణమూర్తి లేచాడు.

డైనింగ్ టేబిల్ ముందు కూర్చున్న కృష్ణమూర్తి రెప్ప వాల్చకుండా మల్లికేసి చూడసాగాడు.

''మల్లీ ! మీ నాన్న నీ కెందుకింకా పెళ్లి చెయ్యలేదు?'' అన్నాడు కృష్ణమూర్తి.

ఒక ఆడపిల్లని, అందునా వయస్సులో పిటపిట లాడిపోతున్న అందమైన కన్యను, ఒక మగవాడు ఇలా ప్రశ్నించకూడదు! ఒకవేళ ప్రశ్నిస్తే... ఆ పిల్ల ఏం సమాధానం చెపుతుంది ?

మల్లి ఆ ప్రశ్నకు నవ్వి వూరుకుందే కానీ సమాధానం చెప్పలేదు !

''నాకు తెలుసు మల్లీ ! నీకు పెళ్ళి చెయ్యడు. పెళ్ళి చేస్తే, ఇక్కడ నువ్వు సంపాదించేదంతా మీ వాన్నకు దక్కదు. అందుకని...''

''అందుకని మీరు ఇలా నా గురించి ఆలోచిస్తుండడం ఏం బావుండలేదు. చెప్పండి. మీ ఇంట్లో వుండడం మీ కిష్టం లేదంటే వెళ్ళి పోతాను'' మల్లి కళ్ళల్లో తడి.

ఆ క్షణంలో మల్లి ముఖం, వాలకం చూసి కృష్ణమూర్తి ఆశ్చర్యపోయాడు. ఇంకేం మాట్లాడకుండా, గబగబా భోజనం చేయసాగాడు !

* * *

ఆ రోజు కృష్ణమూర్తి చాలా ఆనందంగా వున్నాడు. వుంటాడు మరి, ఎందుకుండడు ?

కృష్ణమూర్తి బావమరిది వచ్చి— ''బావగారూ ! మా అక్కయ్యను అర్జంటుగా తీసుకెళ్ళాలి. సుజాతని చిన్నతనంలో పెంచిన ముసలామె చావుకు దగ్గిరగా వుంది. సుజాతను చూడాలని కలవరిస్తోంది. పంపండి. మళ్ళీ రెండు రోజుల్లో పంపుతాను'' అన్నాడు.

అప్పటికి వారం రోజుల నుంచీ సుజాతకి కొంచెం కులాసాగా వుంది. ముందు వూరు పంపకూడదనుకున్నాడు. కాని, పంపక తప్పలేదు. సుజాత కూడా వూరు వెళ్ళడానికి ఇష్టపడింది.


సుజాత కారులో వెళ్ళేప్పుడు మల్లిని దగ్గిరికి పిలిచి—

''ఇదుగో మల్లీ ! నేను రెండు రోజుల తరువాత వస్తాను. అంతవరకూ, ఇల్లు జాగ్రత్త ! అయ్యగారికి పొద్దుటే వేడినీళ్ళు, కాఫీ టిఫిన్ అన్నీ ఏర్పాటు చెయ్యి. వంట రెండు పూటలా చేసివుంచు. తెలిసిందా ?'' అని చెప్పి మరీ వెళ్ళింది.

కృష్ణమూర్తి ఆఫీసులో పనులన్నీ చకచకా పూర్తి చేసుకుని ఎంత తొందరగా ఇంటికి రావాలని ప్రయత్నించినా కుదరలేదు. సంతకాలతోనే సరిపోయింది.

రాత్రి ఎనిమిది గంటలు దాటిన తర్వాత ఇంటికి వచ్చాడు కృష్ణమూర్తి. ఆ సమయంలో మల్లి రేడియో దగ్గర పెట్టుకుని తెలుగు పాటలు వింటోంది. ఆ పాటకు పరవశించిపోతూ కళ్ళు మూసుకుని ఏదో అందమైన కల కంటోంది !

కృష్ణమూర్తి కుతూహలంగా ఆమెనే చూస్తూ వుండిపోయాడు. పాట అయిపోడంతో మల్లి అందమైన కల చెదిరిపోయింది. ఎదురుగా నిల్చుని తననే చూస్తున్న యజమానిని చూసిన మల్లి కంగారుగా లేచి—




''మీరా బాబు!''

''అవునుగానీ! పాట అంత బావుందా?''

మల్లి సమాధానం చెప్పకుండా సిగ్గుతో తల వంచేసింది. కృష్ణమూర్తి మరోసారి ఆమెకేసి చూసి తృప్తిగా నిట్టూర్చాడు.

''రండిబాబు ! మీకు భోజనం వడ్డించేస్తాను'' అంటూ వంట గదిలోకి వెళ్ళిపోయింది.

* * *

రాత్రి పది గంటలు దాటింది.

సుజాతా నిలయంలో లైట్లు వెలగడంలేదుకానీ, కృష్ణమూర్తి గుండె కార్నర్‌లో 'ఆశ' అనే లైటు వెలుగుతూ ఆరిపోతోంది. ఆరిపోతూ వెలుగుతోంది !

నిశ్శబ్దంగా ఉన్న ఆ గదిలో కృష్ణమూర్తి ఆలోచనలు భయంకరంగా ఉన్నాయి.

ప్రతి మనిషికీ కొన్ని చెప్పకోలేని అనుభూతులూ, అనుభవాలూ కావాలి. అనుభూతులూ, అనుభవాలూ, మనిషికి చివర దశలో తోడుగా ఉంటాయి !

ఐనా, కృష్ణమూర్తికి ఈ అనుభూతి చాలా విచిత్రంగా ఉంది. 'ఇదీ' అని చెప్పలేనంత సంతోషంగా ఉంది. కొద్ది సేపట్లో మల్లి తన కౌగిలిలో ఉంటుంది. ఆమె అందాల్ని తను సొంతం చేసుకోబోతున్నాడు. వయస్సు దాటుతున్న తనకే ఇలా ఉంటే, వయస్సులో ఉన్న మల్లికింకెలా ఉంటుంది?

అప్పటికి సరిగ్గా టైమెంతయిందో తెలియదు. కృష్ణమూర్తి నెమ్మదిగా లేచి గది బయటకొచ్చాడు.

సుజాత పడుకునే గదిలో మల్లి పడుకునుంది. ఆ గదిలో కొద్దిపాటు వెలుతురు మాత్రమే ఉంది. అంటే మల్లి నిద్రపోతోందన్నమాట !

కృష్ణమూర్తి సరాసరి కిటికీ దగ్గిరికెళ్ళి లోపలికి తొంగి చూశాడు మల్లి చాప వేసుకుని క్రింద పడుకునుంది. ఆమె కట్టుకున్న చీర అస్తవ్యస్తంగా ఉంది.

వెంటనే తలుపు తీసుకుని లోపలకు వెళ్ళా లనుకున్నాడు. ఒకవేళ లోపల తలుపు గడియ వేసుకుని పడుకుని వుంటే ఏం చెయ్యాలి ? అవును! ఏం చెయ్యాలి ! పేరుపెట్టి లేపితేసరి.

ఎందుకైనా మంచిదని కృష్ణమూర్తి తలుపు తోసి చూశాడు. తలుపులు గడియపెట్టిలేవు ! అతని ఆనందానికి అంతులేకుండాపోయింది. గడియ వేసుకోకుండా పడుకున్న మల్లికి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. గడియ వేసుకోకుండా పడుకున్నదంటే, మల్లికి తనంటే ఎంతో ఇష్టమన్న మాట ! అంతేగదామరి !

కృష్ణమూర్తి నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ లోపలికెళ్ళాడు.

వళ్ళంతా వేడిగా, గుండె వేగంగా, శ్వాస ఎక్కువగా, నరాలు పటుత్వంగా — అన్నీ ఉద్రేక పరుస్తుండగా కొన్నిక్షణాలు మల్లికేసి చూసి ఆమె మీదకు వొంగబోయాడు.

సరిగ్గా అప్పుడే, ఆ క్షణంలోనే మల్లి నిద్రలో అటూ ఇటూ కదిలింది. పసిపాప ఉయ్యాల తొట్టిలో పడుకున్నట్టుగా కాళ్ళు ముడుచుకుని పడుకుంది. వూహ తెలియని పాప నవ్వులా ఆమె ముఖం ప్రశాంతంగా ఉంది !

కృష్ణమూర్తి మల్లికేసి మరోసారి చూశాడు. ఆ క్షణంలో అతనికి మల్లిలో చనిపోయిన తన పదేళ్ళ కూతురు కనిపించింది. తన చేతులమీదుగానే చనిపోయిన కూతుర్ని, ఇప్పుడు మల్లి చాపమీద పడుకున్న విధంగా పడుకోబెట్టి స్మశానానికి తీసుకెళ్ళాడు !

కానీ, కావచ్చు !

ఇప్పుడు ఇక్కడ మల్లి అనే ఒక అందాలరాశి తన యవ్వనంతో పిచ్చివాణ్ణి చేస్తోంది. ఏది ఏమైనా ఈ మల్లెపూవును వాసన చూడవలిసిందే ...

కృష్ణమూర్తి తన్మయత్వంగా కళ్ళు మూసుకుని మల్లి చెంతకు చేరబోయాడు.

ఏ ఘడియ ఎటువంటిదో —

అప్పుడే ఆ గదిలో వున్న గడియారం గంటలు కొట్టసాగింది. ఒకటి... రెండు... మూడు... పదకొండు గంటలు కొట్టింది. ఇంతలో బయట దబదబా తలుపు కొడుతున్న చప్పుడు.

మల్లి నిద్రలోనే అటూ ఇటూ మళ్ళీ కదిలింది. దూరంగా ఒక మూలకి పడున్న దుప్పటి తీసి ఆమెకు కప్పి తృప్తిగా నిట్టూర్చాడు కృష్ణమూర్తి.

ఇప్పుడు కృష్ణమూర్తిలో ఏదో ఒక మంచి పని సాధించానన్న గర్వంతో కూడిన చిరునవ్వు తొణికిసలాడింది. అతని ఉద్రేకం, గుండెదడ తగ్గి మామూలు మనిషిలా అయిపోయాడు, అంతే ! కృష్ణమూర్తి ఇంకేం ఆలోచించకుండా గబగబా ఆ గదిలోనుంచి బయటకొచ్చి వీధి తలుపు తీశాడు.

అతనికి ఎదురుగా భార్యా, బావమరిదీ !

* * *

సుజాత వూరునించి వచ్చిన మరుసటి రోజే తల్లిని చూడ్డానికని మల్లి నాలుగు రోజులు శెలవు తీసుకుని వెళ్ళి ఈ రోజే వచ్చింది తిరిగి.

ఈ రోజు కృష్ణమూర్తి, సుజాతలకు చాలా మంచిరోజు — పెళ్ళయిన రోజు.

అంచేత, సుజాత తన కిష్టమైన పట్టుచీర కట్టుకుని, పెళ్ళినాటి వుంగరం పెట్టుకోవాలని అనుకుంది. పట్టుచీరైతే తీసుకుందిగానీ, పెళ్ళినాటి వుంగరం కనిపించలేదు ! ఆదుర్దాగా బీరువా అంతా వెదికింది; ఎక్కడైనా పెట్టి మరిచిపోయిందేమోనని ఇల్లంతా వెదికింది. ఐనా, ఎక్కడా కనిపించలేదు.

భర్త ఇంకా ఇంటికి రాలేదు. గబగబా ఆఫీసుకు ఫోన్ చేసి విషయం చెప్పింది.

## మానవత్వం నీడలో

''ఎక్కడో పెట్టి మర్చిపోయివుంటావ్ ! జాగ్రత్తగా వెదుకు !'' అన్నాడు కృష్ణమూర్తి.

''లేదండి ! అంతా వెదికాను. ఎక్కడా కనిపించ లేదు.''

''సరిగ్గా చూడు.''

''చూశానండి. ఏవండీ ! నాకెందుకో మల్లి మీద అనుమానంగా వుంది. పొద్దుటనించీ అది నన్ను తప్పించుకు తిరుగుతోంది.''

''ఛా ! వూరుకో ! అనవసరంగా ఆ పిల్లను అనుమానించకు !''

''మీకేం తెలియదుగానీ, మీరర్జంటుగా ఇంటికి రండి.''

''అలాగే.''

భార్యాభర్తల కెదురుగా మల్లి తలొంచుకుని దోషిలా నిలబడింది.

''చెప్పవే ! నువ్వెందుకీ పని చేశావ్?''

''నాకేం తెలియదు!''

''మల్లీ ! నిన్నెంతో ఆదరంగా చూశాం. నీకెలా ఈ దొంగతనం చెయ్యా లనిపించింది ?'' అడిగాడు కృష్ణమూర్తి.

మల్లి సమాధానం చెప్పలేదు, తలొంచుకుని నిలబడింది.

''ఇది ఇలా ఎందుకు చెబుతుందండి!పోలీసులకు అప్పజెబ్తే సరి. ఇది అనుకోకుండా వూరు ఎందుకు వెడుతోందోనని అప్పుడే అనుమానించాను, గానీ, ఇంత బరితెగిస్తుందనుకోలేకపోయాను. చెప్పవే! ఆ వుంగరం ఏం చేసావో చెప్పు !''

అప్పటికీ మల్లి సమాధానం చెప్పలేదు.

''ఇదిగో మల్లీ ! నిన్ను శిక్షించడం చాలా తేలిక. కానీ నేనాపని, చెయ్యను. ఎందుకో తెలుసా? నువ్వు కంటికి రెప్పలా అమ్మగార్ని చూసుకున్నావ్. కానీ, నీ కెందుకో ఈ పాడుబుద్ధి పుట్టింది. ఇక, నువ్వు ఇక్కడ ఉండడానికి వీల్లేదు. వెళ్ళిపో, తక్షణం వెళ్ళిపో !'' కృష్ణమూర్తి అరిచినంత పని చేశాడు,

భర్త కోపం చూసిన సుజాత కంగారుపడింది – ''అది కాదండి. నా మాట విని...'' ఇంకా ఏదో చెప్పబోతున్న భార్యని వారించి—

''ఇంకా ఇక్కడే నిలబడి వున్నావేం ? ఊ ! వెళ్ళు !'' అన్నాడు.

మల్లి తలెత్తి చూసింది

ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి.

చివరిసారిగా ఇద్దరికీ నమస్కరించి నెమ్మదిగా బయటికి నడవసాగింది.

* * *

సడిలేని వీధి.

కృష్ణమూర్తి గదిలో కూడా చీకటిగానే ఉంది

బెడ్‌మీద పడుకునివున్న కృష్ణమూర్తి మనస్సు అశాంతిగా వుంది. కళ్ళు మూసుకున్నా మల్లి రూపమే మెదులుతోంది.

''మల్లీ ! నన్ను క్షమించు !'' అనుకున్నాడు.

అలా ఇప్పటికి చాలాసార్లు అనుకున్నాడు, అనుకున్నాగానీ, అతనికింకా అశాంతిగానే వుంది.

మల్లిని అనుభవించకపోయినా, ఆమెకు తీరని ద్రోహం చేశాడు !

తన భార్య ఎంతో అపురూపంగా చూసుకుంటున్న వుంగరాన్ని తనే దొంగిలించాడు. ఆ నేరం మల్లి చేసినట్టుగా చిత్రీకరించాడు. తనిలా ఎందుకు చేశాడు —

మల్లి సౌందర్యాన్ని, మల్లి యవ్వనాన్ని తను పొందాలని ఆశించాడు. ఆశించి, అవకాశం కోసం ఎదురుచూశాడు. ఆ అవకాశం రానే వచ్చింది. ఐనా, తనామెను పొందలేకపోయాడు. తన మనస్సులో ఎక్కడో మానవత్వం దాగివుంది. ఆ మానవత్వం ముందు, తన వుద్రేకం తలవంచక తప్పలేదు !

తాత్కాలికంగా తను తలవంచినా, మల్లి అందం తనను పిచ్చివాడ్నిగా చేయసాగింది.

తను పతనం చెంది, మరో కన్య జీవితాన్ని పతనం చెయ్యలేదు !

తను మనిషిగా, ఆదర్శవంతుడిగా వుండాలంటే, మల్లి తనెదుట వుండకూడదు. అందుకే — తనను తాను రక్షించుకుని, మల్లిని రక్షించటం కోసం ఈ పనిచేశాడు.

మల్లి ఎక్కడున్నా విజాయితీగా బతక్కలదు ఆమెకు అణుకువ, ఓర్పు అన్నీ వున్నాయి !

జీవితంలో తను ఏవేవో అద్భుతాలు చెయ్యకపోయినా, మనిషిగా, మనసున్న మనిషిగా ప్రవర్తించాడు !

ఈ ఆలోచనలతో కృష్ణమూర్తి మనస్సు తేలికపడ్డట్టయింది. తృప్తిగా నిట్టూర్చి, కళ్ళు మూసుకుని పడుకున్నాడు ! ★

